బియ్యం డెలివరీని వేగవంతం చేయాలి

రైస్‌మిల్‌లో బియ్యం పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్.. రైస్‌మిల్లర్లతో కలెక్టర్

- కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, మే16: బియ్యం డెలివరీ, యాసంగి సీజన్‌కు సంబంధించి టెండర్ ధాన్యాన్ని త్వరగా అప్పగించాలని రైస్‌మిల్ యజమానులకు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న వెంకటేశ్వర రైస్‌మిల్‌ను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మిల్లర్లు బియ్యం డెలివరీని వేగవంతం చేసి త్వరగా అప్పగించాలని, టెండర్ పూర్తి అయిన యాసంగి 2022-23 ధాన్యం వెంటనే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బియ్యం డెలివరీలో జిల్లాను ముందు వరుసలో నిలపాలని, రోజు వారి నివేదికలు అందజేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు జిల్లా మేనేజర్ హరికృష్ణ, సివిల్ సప్లై కార్పొరేషన్ సిబ్బంది ఉన్నారు.

29న చాకరిమెట్లలో మన్యసూక్త పారాయణం

ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న శ్రీమాధవానందసరస్వతీ స్వామి

శివ్వంపేట, మే 16: మండలంలోని చిన్నగొట్టిముక్ల పంచాయతీలో కొలువైన సహకార ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 29న సహస్ర మన్యసూక్త పారాయణం నిర్వహించనున్నట్లు రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. గురువారం సహస్ర మన్యసూక్త అభిషేకం, పురుష సూక్త అభిషేకం, శ్రీసూక్త పారాయణం, మహారుద్ర పారాయణం, సత్యనారాయణ స్వామి వ్రతం, లక్ష తమలపాకులతో ఆంజనేయస్వామికి పూజ నిర్వహించారు. ఈ పూజ ఆలయ ఫౌండర్ చైర్మన్ భాస్కరరాయిని ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకు ముందు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రమణారావు, మల్లేశ్‌యాదవ్, వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, పూజారులు శ్రీప్రసాద్‌శర్మ, దేవదత్తుశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దంతెపల్లిలో పశువుల పాకపై చిరుత దాడి

దంతెపల్లి గ్రామ శివారులోని పశువుల పాకపై చిరుత దాడి

రామయంపేట, మే 16: మండలంలోని దంతెపల్లి గ్రామ శివారులో ఉన్న ఓ పశువుల పాకపై చిరుత దాడి చేసిన ఘటన గురువారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే దంతెపల్లి గ్రామానికి చెందిన నక్కిర్తి భూదవ్వ ఎప్పటిలాగే తన పశువులను గ్రామ శివారులోని తన పశువుల పాకలో ఉంచి రాత్రికి ఇంటికి వెళ్లింది. గురువారం పశువుల పాకకు వెళ్లి చూడగా చిరుత అడుగులు కనిపించాయి. పాకలోకి వెళ్లి చూడగా ఒక దూడ కనిపించక పోవడంతో అదే ప్రాంతంలో వెదకగా దూడను చిరుత తీసుకెళ్లి హతమార్చినట్లు తెలిసింది. విషయం తెలిసిన గ్రామస్తులు, ఫారెస్టు అధికారులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. అడుగులు చూసి చిరుతనే దాడి చేసిందని తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ కింద పడి బాలుడు మృతి

అప్పాజిపల్లిలో మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబీకులు

చిలిపిచెడ్ (కొల్చారం), మే 16: ట్రాక్టర్ ట్రాలీ కింద పడి రెండేండ్ల బాలుడు మృతి చెందిన ఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అప్పాజిపల్లిలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన బోసు రమేశ్, శివలక్ష్మి కుమారుడు జశ్వంత్(2) ట్రాక్టర్ ట్రాలీ నీడకు ఆడుకుంటున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్ చూడకుండా ట్రాక్టర్ నడపడంతో ట్రాలీ టైర్ కింద పండి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకులు ట్రాక్టర్ యజమాని ఇంటి ముందు మృతదేహంతో రెండు గంటలు ఆందోళన చేశారు. డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో తన కొడుకు మృతి చెందాడని,వారిపై దాడికి దిగారు. ఈ విషయం తెలుసుకున్న కొల్చారం ఎస్సై మహ్మద్‌గౌస్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు బ్లాక్ బెల్టుల ప్రదానం

మెదక్ మున్సిపాలిటీ, మే 16: జిల్లాస్థాయి కరాటే పోటీల్లో పలువురు విద్యార్థులు బ్లాక్ బెల్టులు సాధించినట్లు కరాటే మాస్టర్ దినాకర్ తెలిపారు. రెంజూకీ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోనిర్వహించిన కరాటే పోటీల్లో బ్లాక్ బెల్టులు సాధించిన విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని ఆర్ఎస్‌పీ ఫంక్షన్ హాల్‌లో గురువారం బెల్టులు అందజేశారు. రెంజూకీ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు అధ్యక్షుడు సగేశ్ విజేతలకు బ్లాక్ బెల్టులు అందజేసి, వారిని అభినందించారు.

బ్లాక్ బెల్టులు సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

నిజాంపేట: నందగోకుల్‌లో వర్షానికి తడిసిన తూకం వేసిన ధాన్యం సంచులు

చిన్నశంకరంపేట: అంబాజిపేట కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం

అకాల వర్షం.. అన్నదాత ఆగం

- గాలివాన బీభత్సం
- తడిసిన ధాన్యం, నేలరాలిన మామిడి, కూలిన ఇండ్లు
- పిడుగు పాటుకు 10జీవాలు, ఆవు మృతి
- విద్యుదాఘాతంతో ఎద్దు..
- తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలి
- క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలి:
- అదనపు కలెక్టర్‌కు బీఆర్ఎస్ శ్రేణుల వినతి

చిలిపిచెడ్ (కొల్చారం): తుక్కాపూర్‌లో వర్షం నీటి వరదకు కొట్టుకుపోతున్న ధాన్యం

మెదక్ మున్సిపాలిటీ, మే 16: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనాలని బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక చర్యలకు నిరసనగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునివ్వడంతో నాయకులు బట్టి జగపతి, మామిళ్ల ఆంజనేయులు, సోములు, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, జగన్ తదితరులతో కలిసి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రమేశ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలకు తడిసి ముద్దయిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి రూ.500 బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మాయ మల్లేశం, బాలరాజు, పెర్క కిషన్, పవన్, నర్సింహారెడ్డి, రమేశ్, యాదగిరి, గోపాల్, రైతులు పాల్గొన్నారు.

నిజాంపేటలో....

నిజాంపేట, మే 16: అకాల వర్షాలతో పంట చేతికచ్చి, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం వర్షం కారణంగా పూర్తిగా తడిసిపోతుంది. నందగోకుల్‌లో కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యంతో పాటు తూకం వేసిన వరి ధాన్యం కూడా పూర్తిగా తడిసిపోతుయింది. వాటిని తరలించేందుకు లారీలు సకాలంలో రానందున ఈ నష్టం వాటిల్లిందని రైతులు పిట్ల రమేశ్, మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించాలని రైతులు కోరారు.

కురిసిన వర్షం... తడిసిన ధాన్యం

చిలిపిచెడ్ (కొల్చారం), మే 16: కొల్చారం, చిలిపిచెడ్ మండలాల్లో గురువారం కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసి ముద్దైంది. కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో ఓ రైతు ధాన్యం వరదకు కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తరలించకపోవడంతో చేతికొచ్చిన పంట వర్షం పాలవుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

చిలిపిచెడ్,మే 16: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని గంగారం తండాలో గురువారం జరిగింది. తండాకు చెందిన లంబడీ శ్రీనునాయక్ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఎప్పటిలాగే తన ఎద్దులను మేత కోసం శివారు ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ మేత మేస్తున్న సమయంలో విద్యుత్ వైర్లు తగిలి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని రైతు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

రామాయంపేటలో భారీ వర్షం

రామాయంపేట, మే 16: రామాయంపేట పట్టణంతోపాటు మండలంలోని డీ.ధర్మారం, సుతారిపల్లి, అక్కన్నపేట, శివ్వాయపల్లి, కోనాపూర్ తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. గురువారం పట్టణంలో ఒక్కసారిగా గాలి, దుమారంతో కూడిన వర్షం రావడంతో జనజీవనం అతలాకుతలమైంది. డి.ధర్మారం గ్రామానికి చెందిన రైతు జెల్ల యాదగిరికి చెందిన ఆవుపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందింది. గాలి దూమారంతో పట్టణంలోని రేకుల షెడ్లు కొట్టుకుపోయాయి. గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. గురువారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం రావడంతో రైతులు ఆందోళనకుగురవుతున్నారు.

చిన్నశంకరంపేటలో గాలివాన బీభత్సం

చిన్నశంకరంపేట, మే 16: చిన్నశంకరంపేటతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షంతో తడిసి ముద్దయ్యింది. గాలి వానకు చెట్లు నేలకొరిగాయి. గురువారం వర్షం కురియడంతో చేతికొచ్చిన పంట నేలపాలయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పిడుగుపాటుతో మూగజీవాలు మృతి

పాపన్నపేట, మే16: పిడుగు పడడంతో మూగజీవాలు మృతి చెందిన ఘటన పాపన్నపేట మండలంలోని ఆరేపల్లిలో గురువారం జరిగింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆరేపల్లి గ్రామానికి చెందిన మస్కరి హన్మంతు వ్యవసాయంతోపాటు మూగజీవాలను మేపుతూ జీవిస్తున్నాడు. గురువారం మేత కోసం తన వద్ద ఉన్న జీవాలను తోలుకొని వ్యవసాయ క్షేత్రం వైపు వెళ్లగా మేత మేస్తున్న జీవాలపై పిడుగు పడింది. దీంతో పది మేకలు మృతి చెందాయి. సూమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

చేగుంటలో భారీ వర్షం

చేగుంట, మే 16: చేగుంట, నార్సింగి మండలాల్లో భారీ వర్షం కురిసింది. గురువారం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి కర్నాల్‌పల్లిలో ఓ పెంకుటిల్లు కూలిపోయింది. పలు చోట్ల మామిడి కాయలు నేలరాలాయి.

రామాయంపేటలో కురుస్తున్న వర్షం

రామాయంపేటలోని వార్డులో కాల్వలా పారుతున్న వర్షపు నీరు

చిన్నశంకరంపేట: అంబాజిపేట కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం

రామాయంపేటలోని గల్లీలో వరదగా పారుతున్న వర్షం నీరు

చందాపూర్‌లో కరెంటు వైర్లపై పడిన చెట్టు

చిలిపిచెడ్ గంగారంతండాలో ఎద్దు



రామాయంపేట డి.ధర్మారంలో పిడుగు పడి ఆవు మృతి

పాపన్నపేటలో మేకలు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్

చేగుంట, మే16: బాధిత కుటుంబాలకు దాతలు ఆర్థిక సాయం అందించి చేయూత నిచ్చారు. నార్సింగి మండలంలోని సంకాపూర్ గ్రామానికి చెందిన ముత్తల బాబు పంచాయతీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగేండ్ల కిత్రం పక్షవాతం వచ్చింది. గురువారం మృతి చెందాడు. మృతుడిది పేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలకు మాజీ సర్పంచ్ సుజాత శ్రీనివాస్ రూ.5వేలు అందించారు.

ఉల్లితిమ్మాయిపల్లిలో ...

చేగుంట మండలంలోని ఉల్లితిమ్మాయిపల్లిలో అతుకురి పెద్దలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. ఉల్లితిమ్మాయిపల్లికి చెందిన అతుకురి లక్ష్మీ ది నిరుపేద కుటుంబం. దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు చేగుంట మండల యూత్ నాయకుడు సంద్రుగు శ్రీకాంత్ బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందిచారు.

30 లోగా కార్పొరేట్ కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి

మెదక్ మున్సిపాలిటీ, మే 16: కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం ఈనెల 15 నుంచి 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులు http://telenaganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తును రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశం మార్చి 2024లో పదో తరగతిలో ఉతీర్ణులై జీపీఏ 7.0 ఆపైన సాధించిన విద్యార్థులకు మాత్రమేనని తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్, బెస్ట్ అవైలబుల్, కస్తూర్బా పాఠశాలలు, గురుకులాల్లో చదివిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

మెదక్ మున్సిపాలిటీ, మే 16: పదో తరగతిలో ఉతీర్ణులైన ప్రతి విద్యార్థి ప్రభుత్వ కళాశాలలో చేరాలని మెదక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యా బోధన ఉంటుందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఎలాంటి ఫీజులు లేకుండా నాణ్యమైన విద్య బోధిస్తారని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్ ఉతీర్ణత సాధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, మే 16: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బోర్డు, ఇతర రాష్ట్రాల బోర్డు నుంచి సమాన గుర్తింపు కలిగిన పరీక్షల్లో ఉతీర్ణులైన విద్యార్థుల దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఫేజ్-1 రిజిస్ట్రేషన్‌కు రూ.200 రుసుంతో ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకు కళాశాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వివరాలకు http:///dost.cgg.gov.in దోస్త్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

నేడు కౌడిపల్లి మండలంలో విద్యుత్ అంతరాయం

నర్సాపూర్, మే 16: నేడు కౌడిపల్లి మండల కేంద్రంతోపాటు సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కోటేశ్వర్ రావు ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. విని యోగదారులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

బీజేపీ గెలుపు ఖాయం

మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

చిన్నశంకరంపేట, మే 16: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ధీమా వ్యక్తంచేశారు. గురువారం చిన్నశంకరంపేటలో మండల అధ్యక్షుడు పగుల రాజు ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సురేశ్‌గౌడ్, అశోక్, మండల ప్రధాన కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, దశరథం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై దాడి హేయమైన చర్య

చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

చిన్నశంకరంపేట, మే 16: ఉపాధ్యాయులపై దాడి చేయించిన ఆర్డీవోపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోచయ్య డిమాండ్ చేశారు. గురువారం చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఉపాధ్యాయులు కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. దాడి చేయించిన ఆర్డీవోను వెంటనే విధుల నుంచి తొలిగించి, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాజగోపాల్‌గౌడ్, శివప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, Jyothi Gundeti W/o. Udaya Kumar Gundeti R/o. H.No.5-98/168, Block A, Lane-2, Siddarth Enclave, Patelguda, Sangareddy District, Telangana State-502319 have corrected/ changed my name from Jyothibai Kolanu to "JYOTHI GUNDETI" for all my records purposes
SRD+HYd-NT-5751

★I, Udaya Kumar Gundeti S/o. Ravinder Kumar R/o. H.No.5-98/168, Block A, Lane-2, Siddarth Enclave, Patelguda, Sangareddy District, Telangana State-502319 have corrected/ changed my name from Udaya Kumar to "UDAYA KUMAR GUNDETI" for all my records purposes
SRD+HYd-NT-5752

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.